సాక్షి
వికారాబాద్

ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



'భగీరథ'కు తప్పని తిప్పలు

సాంకేతిక సమస్యల కారణంగా కొడంగల్ నియోకవర్గంలో మిషన్ భగీరథ నీటి సరఫ రాకు ఆటంకం కలుగుతోంది. 8లో▸



నంబర్ ప్లేట్ లేకుంటే చర్యలు

ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుంటే చర్యలు తప్పవని నవాబుపేట ఎస్‌ఐ అరుణ్ కుమార్ హెచ్చరించారు. 8లో▸



మూఢవిశ్వాసాలను..

పెరిగిపోతున్న మూఢవిశ్వాసాలను నిర్మూలి ద్దామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సి పాల్ రఫియాఖానమ్ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

లక్ష్యానికి మించి ఆదాయం

ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ



ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు ఈ సంవత్సరం రూ.1.15 కోట్ల ఆదాయం సమకూరిందని ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. లక్ష్యానికి మించి ఆదాయం రావడం మార్కెట్ వృద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష్యం రూ.91.57 లక్షలు కాగా రూ.23లక్షల 83 వేలు అదనంగా ఆదాయం వచ్చిందని తెలిపారు. పత్తి కొనుగోళ్లపై రూ.49.53 లక్షలు రాగా, పౌర సరఫరాల శాఖ నుంచి ధాన్యం కొనుగోళ్లపై రూ.47.35 లక్షలు, మార్కెట్ యార్డు ద్వారా రూ.18.52 లక్షలు సమకూరాయని పేర్కొన్నారు.

వేరుశెనగ, పసుపు రాక

ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం వేరుశెనగ, పసుపు ఉత్పత్తుల రాక ప్రారంభమైందని ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. వేరుశెనగ 35 బస్తాలు వచ్చాయని, క్వింటాలుకు రూ.4,900 నుంచి రూ.5,300 వరకు ధర పలికిందని పేర్కొన్నారు. పసుపు 2 బస్తాలు వచ్చిందని క్వింటాలుకు రూ.11 వేల చొప్పున అమ్మకాలు జరిగాయని తెలిపారు. మొక్కజొన్న 258 బస్తాలు వచ్చాయని, క్వింటాలుకు రూ.2,150 నుంచి రూ.2,300 వరకు, కందులు 653 బస్తాలు రాగా క్వింటాలుకు రూ.6,900 నుంచి రూ.7,440 వరకు ధర పలికిందని ఆమె వివరించారు.

షాపింగ్ మాల్‌పై ఫిర్యాదు


అనంతగిరి: తొమ్మిది రూపాయలకే చీర ఇస్తామంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలను ఎండలో నిల్చోబెట్టి.. కొందరికే ఇచ్చి మిగిలిన వారిని అవమానించేలా వ్యవహరించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి గీత డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్ పీఎస్‌లో సీఐ భీంకుమార్‌కు ఫిర్యాదు అందజేశారు. కనీసం తాగు నీరు, టెంట్ కూడా ఏర్పాటు చేయకుండా మహిళలను ఇబ్బంది పెట్టారని, ట్రాఫిక్‌తో వాహనదారులు అవస్థలు పడ్డారని పేర్కొన్నారు. ఇందుకు కారణమైన జేఎల్ఎం షాపింగ్ మాల్ నిర్వాహకులపై కేసు నమోదు చేయాలని కోరారు.

వ్యవసాయ రంగానికి తోడ్పాటు ఇవ్వాలి

కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య

చేవెళ్ల: వ్యవసాయ రంగానికి మద్దతుగా విద్యా సంస్థలు తమవంతు కృషి చేయాలని కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి కె.పద్మనాభయ్య సూచించారు. శనివారం నగరంలో మండల పరిధిలోని సాగర్ ఫుడ్ అండ్ అగ్రి బిజినెస్ స్కూల్ విద్యార్థుల పీజీ డిప్లొమా అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మనాభయ్య మాట్లాడుతూ.. వ్యవసాయానికి వెన్నుదన్నుగా ఉండేందుకు సాగర్ గ్రూప్ వ్యవసాయ రంగ విద్యను అందించడం అభినందనీయమన్నారు. వ్యవసాయ రంగ సమస్యలను పరిష్కరించేందుకు, వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు యువ నిపుణులు కృషి చేయాలన్నారు. వ్యవసాయరంగంలో నూతన అవిష్కరణలను తీసుకురావాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సారగ్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ కె.ప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్ కేవీ రాజు, సంస్థల వ్యవస్థాపకుడు డబ్ల్యూ.రాంపుల్లారెడ్డి, డాక్టర్ మాలతిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌడ కులస్తుల సంక్షేమానికి ఐక్యతతో పనిచేయాలి



దర్శన్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్: గౌడ కుల అభివృద్ధికి కులస్తులంతా ఐక్యతతో పనిచేయాలని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు నక్క కృష్ణగౌడ్ అన్నారు. మొయినాబాద్‌కు చెందిన రేనట్ల దర్శన్‌గౌడ్ సంఘం జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా శనివారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణగౌడ్ మాట్లాడుతూ.. గీత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. గౌడ సదస్సులు నిర్వహించి కులస్తులను ఏకం చేయాలన్నారు. అనంతరం దర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని.. గౌడ కుల అభివృద్ధి, ఐక్యతకోసం పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేనట్ల మల్లేశ్‌గౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి మహేందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు నర్సింహాగౌడ్, మండల అధ్యక్షుడు అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.



వికారాబాద్‌లో ముస్తాబైన రామ మందిరం

శ్రీరామ నవమికి ఆలయాలు ముస్తాబు

శ్రీరామ నవమి పర్వదినానికి జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం వేద మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వికారాబాద్ సమీపంలోని అనంతపద్మనాభ స్వామి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

– అనంతగిరి

'ఎర్లీబర్డ్'కు బోణీ

మొదట చెల్లించిన వ్యక్తికి సన్మానం

షాద్‌నగర్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించిన ఇంటి యజమానిని శనివారం మున్సిపల్ అధికారులు ఘనంగా సన్మానించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకం కింద ఐదు శాతం రాయితీ కల్పిస్తుంది. పట్టణంలోని ఈశ్వర్ కాలనీకి చెందిన పాతూరి సత్యనారాయణ రూ.1.46లక్షల ఆస్తి పన్ను చెల్లించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సునీత, అధికారులు ఆయన్ను శాలువాతో సన్మానించారు.

పారిశుద్ధ్యం..అధ్వానం

చెత్తాచెదారంతో కంపుకొడుతున్న మున్సిపాలిటీలు

పారిశుద్ధ్య మెరుగు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రవేశపెడుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం సత్ఫలితాలు ఇవ్వడం లేదు. గ్రామాలు, పట్టణాలు చెత్తాచెదారం, మురుగుతో కంపు కొడుతూనే ఉన్నాయి. సిబ్బంది కొరత, ప్రజలను చైతన్యం చేయడంలో అధికారులు విఫలం కావడం పారిశుద్ధ్య సమస్యకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'సాక్షి' ప్రత్యేక కథనం

- జిల్లా కేంద్రంలో మరీ దారుణం
- అరకొరగా పబ్లిక్ టాయిలెట్లు
- ప్రతిపాదనల్లోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు
- ఇబ్బందుల్లో జనం



వికారాబాద్ పట్టణంలో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ

సాక్షి ఫోకస్

వికారాబాద్: వికారాబాద్ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ఏటా భారీగా నిధులు వెచ్చిస్తున్నా పారిశుద్ధ్యం మాత్రం మెరుగుపడటం లేదు. నిత్యం ఏదో ఒకచోట డ్రైనేజీలు పొంగి పొర్లుతూనే ఉన్నాయి. రోడ్లపై మురుగు ప్రవహిస్తుండటంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడ్డా రోడ్లన్నీ మురుగుతో నిండిపోతున్నాయి. డ్రైనేజీల నిర్మాణం కోసం పదే పదే ప్రతిపాదనలు పంపుతున్నా అవి బుట్టదాఖలవుతున్నాయి.

అవసరం కొండంత.. ఉన్నది గోరంత..

వికారాబాద్ పట్టణంలో 80 వేలకు పైగా జనాభా ఉంది.. జిల్లా కేంద్రం కావడంతో నిత్యం 20 నుంచి 30 వేల మంది వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో పది చోట్ల పబ్లిక్ టాయిలెట్లు ఉన్నాయి. ప్రస్తుత జనాభాకు అవి ఏమాత్రం సరిపోవడం లేదు. మరో పది అవసరం. పట్టణ పరిధిలో 33.50 కిలో మీటర్ల పొడవునా సీసీ డ్రైనేజీ, 3.38కిలో మీటర్ల రాయితో నిర్మించిన డ్రైనేజీ ఉంది. మరో ఐదు కిలోమీటర్ల కచ్చ డ్రైనేజీ ఉంది. వీటికి అదనంగా మరో 40కిలో మీటర్ల మేర సాధారణ డ్రైనేజీ, 60 కిలో మీటర్ల మేర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం ఉన్న డ్రైనేజీలు ఆయా కాలనీల సామర్థ్యానికి తగ్గట్టు లేకపోవటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, పాలకులు వికారాబాద్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కంపుకొడుతున్న కాలనీలు

పరిగి: పరిగి పట్టణం మున్సిపాలిటీగా ఏర్పడి ఐదు సంవత్సరాలు కావస్తున్నా సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. చాలా కాలనీలు చెత్తాచెదారం, మురుగుతో కంపు కొడుతున్నాయి. గతంలో డ్రైనేజీలు నిర్మించాలని ప్రజలు ధర్నాలు చేసినా పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. పట్టణ పరిధిలోని అయ్యప్పకాలనీ, వెంకటేశ్వర కాలనీ, తుంకలగడ్డ, శ్రీనివాస కాలనీ, టీచర్స్ కాలనీలను డ్రైనేజీ సమస్యలు వెంటాడుతున్నాయి. మురుగు నీటిని కాలనీల్లోని ఖాళీ ప్లాట్లలోకి వదులుతుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపాలిటీలో 8 కిలోమీటర్ల మేర మురుగు కాలువలు ఉండగా మరో 8.5 కిలో మీటర్లు నిర్మించాలని అధికారులు అంచనా వేశారు. పరిగి బస్టాండ్ పక్కన ఉన్న మూత్రశాలలను శుభ్రం చేయకపోవడంతో కంపుకొడుతున్నాయని ప్రజలు తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మూత్రశాలలు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



అయ్యప్ప కాలనీలో ప్లాట్ల మధ్యలో మురుగు నీరు



వినియోగంలో లేని మరుగుదొడ్లు

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. పట్టణంలోని సిటిజన్ క్లబ్, సంత బజార్, బీసీ కమ్యూనిటీ హాల్, వడ్డర్‌గల్లి తోపాటు పలు

మూత్రశాలలు నిరుపయోగం

ప్రాంతాల్లోని మరుగుదొడ్లు, మూత్రశాలలకు నీటి సౌకర్యం లేదు. మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేదు. గతంలో నిర్మించాలని భావించినా అధికారుల తీరువల్ల కార్యరూపం దాల్చలేదు. పట్టణంలో భారీ వర్షం పడితే మురుగు నీరు రోడ్లపై ప్రవహించి ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో మురుగు కాలువలు

తాండూరు: తాండూరు మున్సిపాలిటీ రోజురోజుకూ ఎంతో అభివృద్ధి చెందుతోంది. కానీ పారిశుద్ధ్యం మాత్రం మెరుగుపడటం లేదు. మురుగు కాలువల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో కాలనీలు కంపుకొడుతున్నాయి. ప్రజల అవసరాల మేర పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఏటా మున్సిపాలిటీల్లో నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షన్ పోటీల్లో తాండూరు చెత్త రికార్డును మూటగట్టుకుంది. దీన్నిబట్టి చూస్తే ఇక్కడ పారిశుద్ధ్య చర్యలు ఏ స్థాయిలో ఉన్నాయో చెప్పనక్కరలేదు.

కదలని మురుగు

తాండూరు మున్సిపాలిటీలో 36వార్డులు ఉన్నాయి. వార్డుల్లో పూర్తి స్థాయి మురుగు కాలువలు లేవు. చాలాచోట్ల దశాబ్దాల క్రితం నిర్మించిన కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి, దీంతో మురుగు ముందుకు కదలడం లేదు. తాండూరు పట్టణం వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతోంది. వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలు మలమూత్ర విసర్జన చేయాలంటే అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉన్నా వాటిని మూసివేశారు. ప్రస్తుతం బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేస్తున్నారు. మల్లప్ప మడిగె వద్ద మూడేళ్ల క్రితం రూ.5 లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లను రోడ్డు విస్తరణ పేరుతో కూల్చివేశారు. ప్రస్తుతం ఇందిరాచౌక్‌లో పేటూ యూజ్ మరుగుదొడ్లు, మూత్రశాలలు అందుబాటులో ఉన్నాయి.



గాంధీచౌక్ వద్ద ఉపయోగంలో లేని మరుగుదొడ్లు



బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్

- స్పీకర్ ప్రసాద్ కుమార్
- ఘనంగా జయంతి వేడుకలు
- నివాళులర్పించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: చిన్నతనంలోనే అంటరానితనాన్ని, కుల వివక్షను ధైర్యంగా ఎదిరించిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని శనివారం వికారాబాద్ పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీహార్ రాష్ట్రంలోని చిన్న గ్రామంలో జన్మించిన జగ్జీవన్ రామ్ దేశ స్థాయిలో అత్యున్నత పదవులను అలంకరించారని తెలిపారు. స్వాతంత్య్ర సమరంలో పాల్గొని జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు. భారతదేశ తొలి కార్మిక శాఖ మంత్రిగా తదుపరి వ్యవసాయ, రక్షణ శాఖలను నిర్వహించారని.. దేశంలో అత్యధిక కాలం కేంద్ర మంత్రిగా కొనసాగిన రికార్డు ఆయన సొంతమన్నారు. నేటి తరం నాయకులకు ఆదర్శమన్నారు. ఆయన బాటలో ప్రతిఒక్కరూ నడవాలని కోరారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా, అన్ని వర్గాలను కలుపుకొని ముందుకెళ్లిన గొప్పవ్యక్తి జగ్జీవన్ రామ్ అని అన్నారు. సాంఘిక అసమానతలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. నేటి యువతరానికి మహనీయుల జీవిత చరిత్ర తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా యువత లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద పటేల్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తగడి రమేష్, పెద్ది అంజి, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి మల్లేశం, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, దళిత సంఘాల నాయకులు ఆనంద్, విజయ్‌కుమార్, రాజలింగం, కృష్ణయ్య, శంకర్, మైపాల్, రాంచందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎంపీ కొండా

వికారాబాద్ పట్టణం బీజేఆర్ చౌరస్తాలోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్. రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు సదానంద్ రెడ్డి, నవీన్, వడ్ల నందు, పాండు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వర్ష కాలనీలోని పార్కు

ఆహ్లాదం.. ఆనందం

- పచ్చదనంతో కళకళలాడుతున్న మున్సిపల్ పార్కులు
- పలు రకాల మొక్కల పెంపకం
- పిల్లలకు ఆట వస్తువులు
- వాకింగ్ ట్రాక్ ఏర్పాటు

కొడంగల్: ఒకప్పుడు పట్టణాలకు మాత్రమే పరిమితమైన పార్కులు ఇప్పుడు పల్లెలకు కూడా విస్తరించాయి. కొడంగల్ మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాలు (పార్కులు) ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. మున్సిపల్ పార్కులు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పట్టణంలోని లాహోటీ, వర్ష కాలనీల్లో ఏర్పాటు చేసిన పార్కులపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అందంగా తీర్చిదిద్దుతున్నారు. పలు రకాల మొక్కలను పెంచుతున్నారు. కంటికి కనువిందు చేసేలా మొక్కలను పెంచారు. పట్టణ వాసులు సేదతీరడానికి కుర్చీలు ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్‌ను నిర్మించారు. పిల్లల కోసం ఆట వస్తువులను బిగిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, మహిళలకు పార్కులు ఆనందాన్ని పంచుతున్నాయి.



అందంగా తీర్చిదిద్దుతాం



కొడంగల్‌లోని పట్టణ ప్రకృతి వనాలను అందంగా తీర్చి దిద్దుతాం. ప్రజలకు ఉపయోగపడేలా రూపొందిస్తాం. పార్కులు అంటే ఇలా ఉండాలి అనే విధంగా తయారు చేయిస్తాం. ఇప్పటికే లాహోటీ, వర్ష కాలనీల్లోని పార్కుల్లో పనులు జరుగుతున్నాయి. కర్ణాటక నుంచి కార్మికులు వచ్చి పనులు చేస్తున్నారు. త్వరలో పూర్తి స్థాయి పార్కులు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

– బలరాం నాయక్, మున్సిపల్ కమిషనర్

విద్యార్థులు సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మీర్‌పేట: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల 23వ వార్షికోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతోమంది పట్టభద్రులు ఈ కళాశాలలో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నారని గుర్తుచేశారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదవాలని ఆయన సూచించారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వేడుకలో కళాశాల కార్యదర్శి హరినాథ్‌రెడ్డి, కోశాధికారి అమర్‌నాథ్‌రెడి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో ఉద్యోగ అవకాశాలు

కుల్కచర్ల: బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో కుక్, మల్టీప ర్పస్ వర్కర్ నియామకానికి ఆసక్తిగల వ్యక్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాసై, అన్ని సమయాల్లో పనిచేయడానికి ఆసక్తి ఉన్నవారు ఈ నెల 15వ తేదీలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కోఆర్డినేటర్ రాజేంద్రనగర్ కార్యాలయంలో బయోడేటాతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కళాశాల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ

తాండూరు టౌన్: తాండూరు పట్టణ శివారులోని తెలంగాణ గురుకుల (బాలికల) కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో అడ్మిషన్ల కోసం విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థినులు ఆన్‌లైన్లో ఈ నెల 23వ తేదీలోపు, రూ. 200ల రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష మే 10వ తేదీన ఉంటుందని పేర్కొన్నారు. అర్హత పొందిన వారికి, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ ఒక్కో గ్రూపులో 35 మంది విద్యార్థినులకు ప్రవేశం ఉంటుందని ఆమె తెలిపారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే


కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను శనివారం ఎర్రవల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొడంగల్ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను పట్నం నరేందర్‌రెడ్డి వివరించారు. దుద్యాల మండలం బీఆర్‌ఎస్ యూత్ కమిటీ అధ్యక్షుడు సురేష్‌రాజ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్ అందజేత


రత్నారెడ్డితో కలిసి సేవలను ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు

అనంతగిరి: గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలకు అంబులెన్స్ సేవలు ఎంతో ఉపయోగపడుతాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి వేణిరావు ఫౌండేషన్ తరుపున అంబులెన్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. ఈ అంబులెన్స్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ఈ సేవలు పేదలకు ఎంతో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్, రత్నారెడ్డి, ప్రతినిధులు డాక్టర్ మహితారెడ్డి, డాక్టర్ వివేక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంచంద్రయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సదానందరెడ్డి, వడ్లనందు, పాండుగౌడ్, నవీన్ కుమార్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

గృహిణి అదృశ్యం

పహాడీషరీఫ్: మానసిక స్థితి సరిగా లేని గృహిణి అదృశ్యమైంది. ఈ సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన ప్రకారం.. మామిడిపల్లి గ్రామానికి చెందిన ఆదిల్ల కృష్ణ భార్య ఆదిల్ల నర్సమ్మ(48)కు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఇంటి పట్టునే ఉంటుంది. ఏ పని చేయకుండా ఇంట్లోని ఉండమని గత నెల 20వ తేదీన ఆమెకు భర్త చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురై ఆమె ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. నర్సమ్మ ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

మిషన్ భగీరథకు తప్పని తిప్పలు

- మంచి నీటి సరఫరాలో ఆటంకం
- కాలిపోతున్న పంప్ మోటార్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు


కొడంగల్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్ల్యూటీపీ)

కొడంగల్: నియోకవర్గంలో మంచినీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. మిషన్ భగీరథలో వస్తున్న సాంకేతిక సమస్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. తరచూ పంపులు, మోటార్లు కాలిపోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో నీటి సరఫరా ఆగిపోతోంది. గతం నుంచి ఇదే తంతు కొనసాగుతున్నా మిషన్ భగీరథ అధికారుల్లో చలనం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆదివారం శ్రీరామ నవమి ఉంది. పండగ రోజున నీటి సరఫరా లేకపోవడంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. గౌరిదేవి పల్లి దగ్గర రెండు మోటార్లు కాలిపోవడంతో కొడంగల్ డబ్ల్యూటీపీకి నీటి సరఫరా నిలిచిపోయింది. కొడంగల్, దుద్యాల, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాలకు రెండు రోజులు నీటి సరఫరా ఉండదని మిషన్ భగీరథ డీఈఈ శశాంక్‌మిశ్రా తెలిపారు. సాంకేతిక సమస్యలు పరిష్కారం అయిన తర్వాత నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని మిషన్ భగీరథ అధికారులు ప్రకటించారు.

తరచూ నీటి సమస్య

మున్సిపల్ పరిధిలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీటిని సరఫరా చేసేవారు. కృష్ణమ్మ జలాలు కొడంగల్ ప్రజల దాహం తీర్చేది. స్వచ్ఛమైన మంచినీటిని ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి రూపకల్పన చేసింది. శ్రీశైలం నుంచి కొడంగల్‌కు తాగు నీరు వస్తుందంటే మొదట్లో ఎవరూ నమ్మలేదు. 283 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణానది నుంచి మిషన్ భగీరథ పథకం ద్వారా కొడంగల్‌కు తాగునీటిని అందించారు. పట్టణ శివారులో సిద్ద నొంపు సమీపంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్ల్యూటీపీ) నిర్మించారు. అక్కడి నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని పంపింగ్ చేసి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఈ మధ్య కాలంలో ఏమైందో ఏమో కాని తరచూ మిషన్ భగీరథలో సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఒక్కోసారి రెండు మూడు రోజుల వరకు నీటి సరఫరా నిలిచి పోతుంది. ప్రస్తుతం వేసవికాలం తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి గుంతలో పడిన కారు

ఎయిర్ బెలున్లు తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం


అల్లాపూర్ సమీపంలో బ్రిడ్జి నిర్మాణ గుంతలో పడిన కారు

తాండూరు రూరల్: బ్రిడ్జి నిర్మాణ గుంతలో ప్రమాదవశాత్తు ఓ కారు బోల్తాపడింది. ఈ సంఘటన మండల పరిధిలోని అల్లాపూర్ సమీపంలో నేషనల్ హైవే రోడ్డు పనుల వద్ద శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం...తాండూరు-చించోళి రోడ్డు మార్గంలో నేషనల్ హైవే పనులు కొనసా గుతున్నాయి. తాండూరు పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు మండలంలోని కోత్లాపూర్‌లో రేణుక ఎల్లమ్మ దేవాలయంను దర్శించుకొని తిరిగి శుక్రవారం రాత్రి తాండూరుకు కారులో వస్తున్నారు. ఈ క్రమంలో అల్లాపూర్ సమీపంలో బ్రిడ్జి నిర్మాణ గుంతలో ప్రమాదవశాత్తు కారు బోల్తా పడింది. ఒక్కసారిగా ఎయిర్ బెలున్లు తెరుచుకోవడంతో కారులో ఉన్న వ్యక్తులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు గమనించి వారిని కారులో నుంచి బయటకు తీశారు. ఓ వ్యక్తికి స్వల్పగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రమాదం జరిగిందని బాధితులు పేర్కొన్నారు. కనీసం బ్రిడ్జి పనుల వద్ద సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై పోలీసులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేసు నమోదు

తాండూరు రూరల్: మండల పరిధిలోని చంద్రవంచ గ్రామ శివారులోని కాగ్నా వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం ..చంద్రవంచ గ్రామానికి చెందిన పటేల్ కరుణాకర్ రెడ్డి గ్రామ సమీపంలోని వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. పోలీసులకు సమాచారం చేరడంతో అక్కడికి వెళ్లి ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో ట్రాక్టర్ డ్రైవర్ పటేల్ కరుణాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


నవాబుపేట: మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ అరుణ్‌కుమార్


కొడంగల్ రూరల్: వాహనదారులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

నంబర్‌ప్లేట్ లేకుంటే చర్యలు

నవాబుపేట: ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా నంబర్‌ప్లేట్ కలిగి ఉండాలని నవాబుపేట ఎస్ఐ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం నంబర్‌ప్లేట్ లేని 17 వాహనాలను గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడపొద్దన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కొడంగల్ రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని 33వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు అందజేశారు. ఎట్టి పరిస్థితుల్లో చిన్నారులకు వాహనాలను ఇవ్వద్దొన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.


దుద్యాల్: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ యాదగిరి

వాహన చోదకులకు అవగాహన

దుద్యాల్: నంబర్ ప్లేట్ లేని వాహనాలకు నడపడం నేరమని దుద్యాల్ ఎస్ఐ యాదగిరి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. చాలా మంది వాహనదారులు నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్నారని, అది చట్టానికి వ్యతిరేకమన్నారు. అలాంటి వారు ఎవరైనా ఉంటే వెంటనే వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని విన్నవించారు.

వైన్స్ షాపులపై ఎక్సైజ్ నిఘా..!

- మద్యం అమ్మకాలను పెంచేందుకు వైన్స్ నిర్వాహకులపై అధికారుల ఒత్తిడి
- ఆదాయం సమకూర్చుకునే పనిలో ప్రభుత్వం


మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తాండూరు ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్

తాండూరు: మద్యం అమ్మకాలను మరింత పెంచి ప్రభుత్వానికి ఆదాయం సమకూరే విధంగా ఎక్సైజ్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అందుకోసం మద్యం దుకాణాలకు ఉన్న లక్ష్యం కంటే 10 శాతం అదనంగా అమ్మకాలను పెంచాలని దుకాణ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాలు కొంత పడిపోయినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు గుర్తించారు.

తాండూరు ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఆధీనంలో..

తాండూరు ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఆధీనంలో 18 మద్యం దుకాణాలున్నాయి. అందులో తాండూరు పట్టణం, మండలాల్లో 9 షాపులు, బషీరాబాద్2, యాలాల2, యాలాల2, పెద్దేముల్ 2, కోట్‌పల్లి మండలంలో 1 చొప్పున మద్యం దుకాణాలున్నాయి. ఆయా మండలాల్లోని దుకాణాల ద్వారా ఎక్సైజ్ శాఖకు ప్రతీ నెల రూ.17.50 కోట్ల వ్యాపారం జరుగుతోంది. ప్రభుత్వం తాండూరు సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాల్లో మద్యం అమ్మకాల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.195 లక్ష్యం విధించింది. అయితే తాండూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో రూ.185 కోట్ల మద్యం వ్యాపారం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌ను చేరుకునేందుకు గతనెల అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కాని ఆశించిన స్థాయిలో మద్యం అమ్మకాలు నిర్వహించడం లేదు. వికారాబాద్ జిల్లాలో వ్యాపార కేంద్రంగా కొనసాగుతున్న తాండూరులో మద్యం అమ్మకాలతో భారీగా ఆదాయం సమకూరుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి, మార్చిలో మద్యం అమ్మకాలు పడిపోవడానికి గల కారణాలను ఆరా తీస్తున్నారు. మరోవైపు గత నెలలో రంజాన్ ఉపవాస దీక్షలు, ఉగాది పండగలు రావడంతో కూడా మద్యం అమ్మకాలు పడిపోయినట్లు ఎక్సైజ్ అధికారులు అంచన వేస్తున్నారు.

మద్యం వ్యాపారంపై రియల్ ప్రభావం..

వికారాబాద్ జిల్లాలోని తాండూరు, పరిగి, వికారాబాద్, పరిగి కొడంగల్ నియోజవర్గాలలో ఏడాది కాలంగా రియల్ వ్యాపారం కుదేలైంది. వ్యవసాయ భూముల క్రయ, విక్రయాలు పూర్తిగా తగ్గిపోయాయి. గతంలో భూముల క్రయ విక్రయాలతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు, తహసీల్దార్ కార్యాలయాలకు జనాలు పెద్ద ఎత్తున వచ్చే వారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక వైన్స్ షాపులో కాని, బార్‌కు వెళ్లి మద్యం సేవించే వారు. అయితే కొన్నాళ్లుగా రిజిస్ట్రేషన్లు ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో ఆ ప్రభావం మద్యం వ్యాపారంపై చూపిందని అధికారులు భావిస్తున్నారు.

10 శాతం వ్యాపారం పెంచాలని వత్తిడి

మద్యం సేవించే వారి సంఖ్య పెంచాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. మద్యం సేవించే వారు ఉంటేనే మద్యం అమ్మకాలు పెరుగుతాయని చెబుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు మద్యం ద్వారా సమకూరే ఆదాయంతోనే పలు పథకాలు కొనసాగుతున్నాయని ఎక్సైజ్ శాఖ అధికారులు అంటున్నారు. మద్యం దుకాణాలలో మందు బాబులకు ఇబ్బందులు కలగకుండా బిజినెస్ పెంచాలని మద్యం దుకాణ దారులకు ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రతీ దుకాణానికి వెళ్లి చెబుతున్నారు.

సీతారాముల ఎదుర్కోలు


సీతమ్మను ఎదుర్కునేందుకు హారతులతో గ్రామస్తులు

గ్రామీణ సాంప్రదాయంగా ఉత్సవం

బొంరాస్‌పేట: శ్రీరామ నవమి సందర్భంగా మండల కేంద్రంలో శనివారం సీతారాముల ఎదుర్కోలు కార్యక్రమం కనుల పండుగగా సాగింది. పూర్తిగా గ్రామీణ సాంప్రదాయంగా జరిగిన భక్తిపూర్వక ఈ సందడి అందరినీ ఆకట్టుకుంది. గ్రామంలోని భక్తసమాజం నుంచి సన్నాయి మేళాలతో, ఆడపడుచుల హారతులతో సీతారాములను ఎదుర్కోల్లతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. స్థానిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాములోరి పెళ్లి ఉత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. ఊరంతా, వీధులన్నీ కాషాయం తోరణాలతో అలంకరించి, రాములోరి కల్యాణానికి ముస్తాబు చేశారు.

జమాత్‌ఏ ఇస్లామి హింద్ సేవలు అభినందనీయం

శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు: తాండూరు పట్టణంలో జమాత్ ఏ ఇస్లామి హింద్ అసోషియేషన్ ప్రతిధుల సేవలు అభినందనీయమని శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి తాండూరు పట్టణంలోని సమద్ ఫంక్షన్ హాల్లో జమాత్ ఏ ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ నిర్వహించారు. ప్రతీ ఏటా రంజాన్ అనంతరం నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్నం మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు ప్రాంతం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచేందుకు జమాతే ఇస్లామి హింద్ ప్రతినిధులు కీలకంగా పని చేస్తున్నారన్నారు. కుల మతాలకు అతీతంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు ముస్లిం వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు కమల్‌అతార్, రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ కన్వీనర్ కరణం పురుషోత్తంరావు, జమాతే ఇస్లామి హింద్ ప్రతినిధులు డాక్టర్ ఖాలీద్‌మ బషీర్‌ఉజ్ జఫర్, అజీజ్ ఉర్ రహమాన్, మౌలాన ఖలీల్, సయ్యద్ సబేర్‌పాషా, అబ్దుల్ గఫార్, అబ్దుల్లా ముబషిర్, మాజీ కౌన్సిలర్‌లు రామకృష్ణ, అబ్దుల్ ఖవి తదితరులు పాల్గొన్నారు.

రూ.6 వేల అప్పు చెల్లించలేదని..

- ప్రియుడితో కలిసి తోటి కూలీని అంతమొందించిన మహిళ
- పెద్దేముల్‌లో హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి


మహిళ హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి


నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

తాండూరు: పెద్దేముల్ మండల కేంద్రంలోని కోట్‌పల్లి కెనాల్‌లో నాలుగు రోజుల క్రితం హత్యకు గురైన మహిళ కేసును పోలీసులు ఛేదించారు. అప్పుగా తీసుకున్న రూ.6 వేలు తిరిగి ఇవ్వకపోవడంతో తోటి కూలీని ప్రియుడితో కలిసి ఓ మహిళ అంతమొందించింది. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం తాండూరు డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నారాయణరెడ్డి వెల్లడించారు. బొంరాస్‌పేట్ మండలం చౌదర్‌పల్లికి చెందిన ఈర్లపల్లి యశోద కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. పనుల కోసం పరిగి పట్టణానికి వెళ్లేది. ఈ క్రమంలో రాంరెడ్డిపల్లి తండాకు చెందిన అనిత, ఉటుపల్లికి చెందిన గోపాల్‌తో పరిచయం ఏర్పడింది. యశోద, అనిత కలిసి కూలి పనులకు వెళ్లేవారు. గతంలో యశోద.. అనిత వద్ద రూ. 6వేలు అప్పుగా తీసుకుంది.. పలుమార్లు అప్పు అడిగినా తిరిగి ఇవ్వలేదు. దీంతో అనిత కోసం పెంచుకుంది. ఎలాగైనా అంతమొందించాలని పథకం వేసింది. ఈ నెల ఒకటవ తేదీ అనిత.. యశోదకు ఫోన్ చేసి పరిగి పట్టణానికి పిలిపించింది. అక్కడే ఉన్న అనిత, గోపాల్.. యశోదను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని వికారాబాద్ వైపు వెళ్లారు. మార్గమధ్యలో యశోదకు మద్యం తాగించారు. అదే రోజు రాత్రి పెద్దేముల్ మండల కేంద్రం పక్కన ఉన్న కెనాల్ వద్ద వాహనం నిలిపారు. పథకం ప్రకారం బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఆమె ఒంటిపై పోసి నిప్పు పెట్టారు. అనంతరం కాలువలోకి తోశారని ఎస్పీ తెలిపారు. పత్రికల్లో మృతురాలి ఫొటోలను చూసిన ఆమె కుమారుడు తన తల్లి యశోద అని చెప్పడంతో కేసు చిక్కుముడి వీడిందని తెలిపారు. నిందితులు మృతురాలి ఒంటిపై ఉన్న నల్లపూసల బంగారు గొలుసు, ముక్కు పుడక, రెండు వెండి కడియాలు, సెల్‌ఫోన్‌ను అమ్మేందుకు హైదరాబాద్ వైపు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. గోపాల్, అనితను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ చూసిన సీఐ నాగేష్, ఎస్ఐలు గిరి, శ్రీధర్ రెడ్డి, క్రైమ్ పార్టీ సిబ్బంది దస్తప్ప, ప్రతాప్, నర్సింహ, మున్నయ్య, జయంత్, మాసయ్య, రఫీక్, సాయప్ప, అశోక్‌ను ఎస్పీ అభినందించారు. సమావేశంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నాగేష్, పెద్దేముల్, యాలాల ఎస్ఐ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని మినీ స్టేడియంలో శనివారం పరిగి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలు ఆడడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై శ్రద్ధ వహించాలన్నారు. క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి కీర్తి తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆయ పార్టీల నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

షాద్‌నగర్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఘటన శనివారం తెల్లవారుజామున షాద్‌నగర్ పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ రాజేశ్వర్ తెలిపిన ప్రకారం.. పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో యమ్మీ హోటల్ ఎదురుగా సుమారు 40 ఏళ్ల వయస్సు ఉన్న ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆక్రమణను అడ్డుకునేందుకు కందకాలు


అడవి సరిహద్దు చుట్టూ జేసీబీతో కందకాలు తవ్విస్తున్న దృశ్యం

ధారూరు: ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలోని అడవి ఆక్రమణకు గురి కాకుండా ఉండేందుకు చుట్టూ కందకాలు తవ్విస్తున్నామని ఫారెస్టు రేంజర్ బి.రాజేందర్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఆక్రమణకు గురైన అటవీ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ రేంజ్ పరిధిలోని అడవిలో ఎవరు కూడా చొరబడకుండా, భూమిని ఆక్రమించకుండా కందకాలును తవ్వించి రక్షణ కవచాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫారెస్టు రేంజ్ పరిధిలోని దోర్నాల్, గురుదోట్ల, అంపల్లి, రాంపూర్‌తండా, బాణాపూర్, రాస్నం, సంగాయపల్లి, మదనంతాపూర్ తండా, పగిడ్యాల అడవి ప్రాంతాల్లో రాత్రిపూట కొంతమంది వ్యక్తులు జేసీబీతో చెట్లను తొలగించి వ్యవసాయ భూమిగా మారుస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొంత మంది రెవెన్యూ అసైన్‌మెంట్ పట్టాల పేరిట అనుమతులు లేకండా ఫారెస్టు భూములను దున్నుతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి ఫారెస్టు యాక్ట్ ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ పరిరక్షణ

పహాడీషరీఫ్: రాజ్యాంగాన్ని కించపరుస్తూ.. అంబేడ్కర్‌ను అవమానిస్తున్న బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ వైఖరి ని ప్రజలకు వివరించేందుకు కాంగ్రెస్ జై బాపు-జై భీమ్-జై సంవిధాన్ నినాదంతో ముందుకు వెళ్తోందని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ ఆ దేశాల మేరకు జల్‌పల్లి మున్సిపాలిటీలో శనివారం సంవిధాన్ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజా స్వామ్యం, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించాలని కా ర్యకర్తలకు సూచించారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా దేశ ప్రజలను చైతన్య పరిచారన్నారు. 11 ఏళ్లుగా రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలను కాలగర్భంలో కలిపే ప్రయత్నాన్ని బీజేపీ ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. పార్లమెంట్ వేదికగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలని గౌరవిస్తూ రాజ్యాంగాన్ని కాపాడే బా ధ్యత కాంగ్రెస్ తీసుకుందన్నారు. జై సంవిధాన్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, జల్‌పల్లి నాయకులు షేక్ జహంగీరుద్దీన్, యాదగిరి, యూ సుఫ్ ఖాద్రీ, యాదయ్య, భాస్కర్‌రెడ్డి, జగన్, ధన రాజ్‌గౌడ్, శ్రీధర్, సుభాన్ యాదవ్, ఫజిల్ ఖాద్రీ, చంద్రమౌలి, నవీన్ గౌడ్ పాల్గొన్నారు.